క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న దివాకర్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా వి.దివాకర్‌రెడ్డి తన చాంబర్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ దివాకర్ రెడ్డిని మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగు, తాగునీటి కొరత రాకుండా చర్యలు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తానన్నారు.

కమిషనర్‌కు సన్మానం

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ దివాకర్‌రెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో పాటు వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిల్ సభ్యులు పూలమాలలు, శాలువతో సత్కరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శెట్టూరు: ప్రతి ఒక్కరికీ హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని రీడ్స్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు హెచ్‌ఐవీ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్‌ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఐవీ సోకినవారిపై వివక్ష చూపకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, రీడ్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పకడ్బందీగా చేపట్టాలి


75 వీరాపురంలో కులగణనను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: సమగ్ర కుల పునరుద్ధరణ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో కులపునరుద్ధరణ సర్వేను ఆయన స్వయంగా బుధవారం తనిఖీ చేశారు. అలాగే గుమ్మఘట్టలో ఓటర్ల జాబితాను పరిశీలించారు. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి వెరిఫికేషన్ పక్కాగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్, ఆర్‌ఐ చంద్రశేఖర్, వీఆర్వో వీరేష్ ,వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సవారమ్మకు పూజలు

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో సవారమ్మ అమ్మవారికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవానితిప్ప ప్రాజెక్టుపై వెలసిన సవారమ్మను ప్రతి యేటా శ్రావణమాసం చివరి మంగళవారం జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగా జలంతో అభిషేకిస్తారు. పూజలు నిర్వహించి గ్రామ పురవీధులలో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


జ్యోతులతో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కుందుర్పి: తుముకుంట, బెస్తరపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. ఆయా గ్రామాల్లో ఉదయం శ్రీకృష్ణుడి చిత్రపటాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వందలాది మంది మహిళలు బోనాలతో ముందుకు సాగారు. జంబుగుంపల, బెస్తరపల్లి, తుముకుంట గ్రామాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ (ఎఅండ్‌టీ) గ్రూపులో ఖాళీగా ఉన్న గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు కళాశాలలో అందజేయాలన్నారు. ఎంకామ్ టాక్సేషన్ విద్యార్హత కలిగి పీహెచ్‌డీ కూడా ఉంటే ప్రాధాన్యత ఇస్తామన్నారు. సెప్టెంబర్ 2న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత



“ ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది రక్షణపై ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. కోల్‌కతా ఘటనతో వైద్యులు, సిబ్బందిలో భయాందోళన కలుగుతోంది. వైద్యులు అంటే దేవుళ్లుగా భావించే మన దేశంలో ఇలాంటి దారుణాలు జరగడం బాధాకరం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకోరావాలి.

– డాక్టర్ వినీత, వైద్యాధికారిణి, సీహెచ్‌సీ ఉరవకొండ

మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ఆసుపత్రులలో పనిచేసే మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి. కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా అన్ని ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఆసుపత్రులలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతి గది ఉండాలి. నిత్యం పోలీసు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో ఘటనలో దోషులకు వేసే శిక్ష మరొకరిని గుణపాఠం కావాలి. ”

– మంజుళ, స్టాఫ్‌నర్స్, అర్బన్ పీహెచ్‌సీ, ఇందిరమ్మ కాలనీ, కళ్యాణదుర్గం



ఖాకీలపై ఖద్దరు స్వారీ !

- నచ్చిన వారికి పోస్టింగ్.. నచ్చని వారికి వేధింపులు
- సెలవులో వెళ్లిపోతున్న సీఐ, ఎస్‌ఐలు
- అదుపుతప్పిన శాంతిభద్రతలు



రాయదుర్గం పోలీసుస్టేషన్

రాయదుర్గం: పోలీసుశాఖపై అధికార పార్టీ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఖద్దరు అనుగ్రహం పొందిన కొందరు ఖాకీలు ఇప్పటికే విధుల్లో చేరిపోగా.. తమ మాట వినాల్సిందేనంటూ ఉన్న సిబ్బందిని నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో వారి ఒత్తిళ్లు తట్టుకోలేక చాలా మంది లాంగ్ లీవ్‌లో వెళ్లిపోతున్నారు. ఖాళీగా ఉండే స్థానాల్లో తమ సంబంధించిన వారికి సీటు దక్కేలా కూటమి నేతలు కొందరు చక్రం తిప్పుతున్నారు.

ఖాళీలు ఇలా..

కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలు కలిపి పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటైంది. దీని పరిధిలోని 2 అర్బన్, 2 రూరల్ సర్కిళ్లతో పాటు 11 మండల పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇటీవల రాయదుర్గం అర్బన్ సీఐ శ్రీనివాసులు ఉన్నట్టుండి లాంగ్ లీవ్‌లో వెళ్లిపోయారు. తన ఇంటి లగేజీతో సహా ఆయన వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఐ శ్రీనివాసులుపై నేతలు కొందరు గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఓ కేసు విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించేలా తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారంటున్నారు. నిక్కచ్చిగా వ్యవహరించడంతో అధికార పార్టీ నాయకుల పోరు భరించలేక సెలవు వెళ్లినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ రూరల్ సర్కిల్ సీఐ నాగరాజు, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల ఎస్‌ఐలు ఆంజనేయులు, పరశురాముడు అదేదారి పట్టారు. వారు కూడా మెడికల్ లీవ్‌లో వెళ్లారు. సీఐ నాగరాజుకు బదిలీ వచ్చినట్లు సమాచారం. దీనికితోడు కళ్యాణదుర్గం రూరల్ యూపీఎస్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్‌ను ఇటీవల నియమించారు. నేటికీ ఆయన మాత్రం విధుల్లో చేరలేదు. అలాగే గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం అర్బన్, రూరల్‌లో మూడు ఎస్‌హెచ్‌ఓ (ఎస్‌ఐ) పోస్టులు ఖాళీ ఉన్నాయి. అక్కడ ఎవరిని నియమిస్తారో అంతుచిక్కడం లేదు. రాయదుర్గం నియోజకవర్గంలోనూ కణేకల్లు ఎస్‌ఐ నెలన్నర క్రితం సెలవులో వెళ్లిపోయారు. రెండు రోజుల క్రితం జరిపిన బదిలీల్లో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు కొత్తవారిని ఎస్‌ఐలుగా నియమించారు. ఇలా కీలక స్థానాల్లో సీఐలు, ఎస్‌హెచ్‌ఓ లు ఖాళీగా ఉండడంతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించలేక పోతున్నారు.

పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు..

సబ్ డివిజన్‌లో గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతుంది. నెల క్రితం రాయదుర్గం మండలం టీ వీరాపురంలో గంజాయి సాగుచేస్తూ ఓ వ్యక్తి పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల జూదం ఆడుతూ 22 మంది పట్టుబడ్డారు. 21 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక, మట్టి, చౌక బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు మొదలయ్యాయి. ఎస్పీతో పాటు డీఐజీ ప్రత్యేక దృష్టి సారించి ఖాళీల భర్తీకి సత్వరం చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతి పక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో కోరుతున్నాయి.

త్వరలో పోస్టులు భర్తీ చేస్తారు



డివిజన్‌లో సీఐ, ఎస్‌ఐ ల ఖాళీలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఆయా పోస్టులను భర్తీ చేస్తారు. కొందరు వ్యక్తిగత కారణాలు, అనారోగ్య సమస్యల దృష్ట్యా మెడికల్ లీవ్‌లో వెళ్లారు. వారు తిరిగి వస్తారు. లేకుంటే కొత్త వారిని నియమిస్తారు. లాఅండ్‌ఆర్డర్ ఎక్కడా దెబ్బతినకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం. సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత ముమ్మరం చేస్తాం. త్వరలో అన్నీ పీఎస్‌లకు పూర్తిస్థాయిలో సిబ్బంది నియమకం ఉండొచ్చు. – రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఇసుక రీచ్ ఏర్పాటుకు చర్యలు


రచ్చుమర్రిలో ఇసుక ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణీ సుస్మిత

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రి గ్రామశివారులో వేదవతి హగిరి ఇసుక ప్రదేశాన్ని కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీ సుస్మితా బుధవారం సందర్శించారు. తహసీల్దార్ ఫణికుమార్, మైనింగ్ అధికారులతో కలిసి ఆర్డీఓ గతంలో సీజ్ చేసిన ఇసుక ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ఈ ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిర్ణయించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఇసుక రీచ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆర్డీఓ బెణికల్లులో ఆర్‌ఓ ప్లాంటు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పవన్‌కుమార్, రూపేష్‌లు పాల్గొన్నారు.

వైసీ పల్లిలో 104 వైద్యసేవలు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్

కంబదూరు: మండలంలోని వైసీపల్లిలో 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శెట్టూరు: కరిడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నాగన్న(41) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నాగన్న ఇంటికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాగన్నకు భార్య దేవీరమ్మ, కుమారుడు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, నాయకులు పోస్ట్ రామకృష్ణ, శెట్టూరు తిప్పేస్వామి, బాబురావు, గౌరయ్య, మీసేవ బాబు, వన్నూరప్ప, గోవిందు, శివన్న పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ నేత, దొడగట్ట గ్రామానికి చెందిన తాతప్ప(80) అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం అర్ధ రాత్రి మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాతప్ప మృతికి సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉండగా కొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కర్రె బజ్జి(42) అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. మృతుడుకి భార్య రాధ, కూతురు, కుమారుడు ఉన్నారు.

వైభవంగా మురాద్‌షావలి ఉరుసు


గంధం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం హజరత్ సయ్యద్ మురాద్ షావలి ఉరుసు బుధవారం ప్రారంభమైంది. ఉదయం స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సాయంత్రం గంధం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధుల్లో గంధం ఊరేగింపు అనంతరం ఆలయానికి చేరుకుంది. గురువారం ఉరుసు, శుక్రవారం జియారత్ కార్యక్రమాలు జరగుతాయని నిరాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పాతచెరువు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. శీబాయి గ్రామానికి చెందిన నాగేంద్ర కళ్యాణదుర్గంలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. అదే సమయంలో శెట్టూరు మండలానికి చెందిన బుడప్ప అనంతపురం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తూ పాతచెరువు గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు అనంతపురం తరలించారు. 108కు సమాచారం అందించినా 40 నిమిషాల పాటు స్పందించలేదు. 108 పనితీరుపై స్థానికులు, బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరామర్శ


జోగి ఆంజనేయులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్ తండ్రి జోగి ఆంజనేయులును బుధవారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న పరామర్శించారు. జోగి ఆంజనేయులుకు కొన్ని రోజుల క్రితం హార్ట్ ఆపరేషన్ జరిగింది. మెరుగైన వైద్య సేవలు అందించాలని అక్కడి వైద్యులను మాజీ ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోగి హనమంతు, జోగి భీమా తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుద్దాల వెంకటేష్ కుమార్తె, పట్టణ వార్డు సభ్యురాలు మౌనిక, ఏపీఎస్‌ఆర్టీసీ కానిస్టేబుల్ మంజునాథ్ వివాహానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి హాజరయ్యారు. వెలిగొండ సర్పంచ్ నాగప్ప కుమార్తె వివాహానికి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు ఏసీ ఎర్రిస్వామి, తిప్పయ్య, నాయకులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరాదరణకు గురైన నిండు గర్భిణి

- హైరిస్క్ కాన్పు కావడంతో అనంతపురం తరలింపు


గర్భిణిని అంబులెన్స్‌లో అనంతపురానికి తరలిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఓ నిండు గర్భిణి ఇటు పుట్టినిల్లు, అటు మెట్టినింటి ఆదరణకు నోచుకోలేదు. హైరిస్క్ కాన్పు కావడంతో ఆరోగ్య సిబ్బంది సహకారంతో అనంతపురం తరలించిన ఘటన రాయదుర్గంలో బుధవారం జరిగింది. పట్టణంలోని కణేకల్లు రోడ్డు వాటర్ ట్యాంక్ సమీపంలోని హౌసింగ్ లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇంట్లో రూప నివాసం ఉంటోంది. ఆమె ప్రస్తుతం నిండు గర్భిణి. పురిటి నొప్పులు అధికం కావడంతో సచివాలయ హెల్త్ సెక్రటరీ సరోజ ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. హైరిస్క్ కేసు కావడంతో వైద్యులు అనంతపురం సిఫార్సు చేశారు. రూప గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందినదని హెల్త్ సెక్రటరీ తెలిపారు. భర్త రామాంజినేయులు ఆమెను వదిలేశాడన్నారు. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లిలో ఆమె తండ్రి రామాంజినేయులును విచారించినా తమకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఓ సహాయకుడు, ఆశా కార్యకర్త తోడుగా ఆమెను అనంతపురం సర్వజన ఆస్పత్రికి కాన్పు కోసం పంపినట్లు పేర్కొన్నారు. కాగా రూపకు ఇప్పటికే ఏడేళ్ల వయస్సు కుమార్తె ఉంది.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట


పూజలందుకున్న దుర్గాదేవి


పూజల్లో పాల్గొన్న మంత్రి సత్య కుమార్

కుందుర్పి: మండల కేంద్రంలో బుధవారం గ్రామదేవత దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి విగ్రహంతో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఆలయంలో వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కుందుర్పి, నిజవళ్లి, బసాపురం, మలయనూరు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ట

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో యల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపించారు. కార్యక్రమంలో హనుమాపురం సర్పంచు జయరాంచౌదరి, నాయకులు శరబన్నగౌడ్, యువరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ట

ఉరవకొండ: విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రస్టు చొరవతో విద్యార్థికి కంటి చూపు

కళ్యాణదుర్గం రూరల్: ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చొరవతో ఓ విద్యార్థికి కంటిచూపు వచ్చింది. వివరాలు..ముదిగల్లు గ్రామానికి చెందిన మారెక్కకు ఒక్కగానొక్క కుమారుడు వంశీ. అతడి తండ్రి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేసుకుంటూ వంశీని చదివిస్తోంది. ఆరో తరగతి చదువుతున్న వంశీ చిన్నప్పటి నుంచి కంటి చూపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ఆర్థికస్తోమత లేకపోవడంతో మెరుగైన వైద్యం చేయించుకోలేకపోయాడు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు లోకేష్(ఆంధ్రాబ్యాంక్) తనకు తెలిసిన వారిని సంప్రదించాడు. రూ.60 వేల నుంచి రూ.80 వేలు ఖర్చయ్యే ఆపరేషన్‌ను తిరుపతిలోని శ్రీనివాస అరవింద్ ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా చేయించాడు. ప్రస్తుతం వంశీ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. ఈసందర్భంగా వంశీతోపాటు అతడి తల్లి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి ఆదిచెన్నకేశవుడి ఉత్సవాలు

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలోని ఆదిచెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ అంగడాల క్రిష్ణయ్య తెలిపారు. బుధవారం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణం, అభిషేకం, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామికి కల్యాణం జరిపిస్తారని పేర్కొన్నారు. అనంతరం పల్లకీ సేవ ఉంటుందన్నారు. 30న అభిషేకం, 11 గంటలకు పల్లకీ సేవ, మడుగుతేరు, సాయంత్రం 5 గంటలకు ఉట్ల ఉత్సవం, స్వామి రథోత్సవ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. 31న స్వామికి అభిషేకం, పల్లకీ సేవ, వసంతోత్సవం, రాత్రి 8 గంటలకు భూదేవి, లక్ష్మమ్మ దోపులు, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

చినుకు పడితే కునుకు కరువే

- జలమయమవుతున్న 10 కాలనీలు


రాయదుర్గం పట్టణ పరిధిలోని పాత మీసేవ ఏరియాలోని పరిస్థితి (ఫైల్)

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ముంపు కాలనీల్లో అరగంట నుంచి గంటపాటు భారీ వర్షం పడిందంటే చాలు కంటి మీద కునుకు కరువై రాత్రంతా జాగరణ చేయాల్సిందే. డ్రైయినేజీ నీరు, వర్షపు నీరు, కొండప్రాంతం నుంచి వరద ప్రవాహం వెళ్లేందుకు ప్రధాన కాలువ ఒక్కటే ఉండడంతో ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలు కష్టాలు పడుతున్నారు. దాదాపు 10 ప్రాంతాలు ముంపు బారిన పడి విలవిలలాడుతున్నాయి.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

కాలువల ద్వారా నీరు వెళ్లేందుకు డిస్పోజల్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం. ప్రస్తుతం ఉన్న ప్రధాన కాలువను రెట్టింపు చేస్తే తప్ప ముంపు సమస్య పరిష్కారం కాదు. వరద నీటిని ఇతర కాలువల ద్వారా మళ్లింపునకు చర్యలతోపాటు డైవర్షన్ ఛానల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కాలువలపై అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో నీరు ముందుకు సాగడం లేదు. గ్యాస్‌గొడన్ ఏరియా రాజీవ్‌గాంధీ కాలనీకి సమీపంలోని జాతీయ రహదారి బ్రిడ్జి వద్దనే వరద నీరు, డ్రైనేజీ నీరంతా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇలాంటి చోట నీరు ఒకవైపు నుంచి మరోవైపుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డిస్పోజల్స్ చాలా చిన్నవిగా ఉండడం ఇబ్బందులొస్తున్నాయి. నీరు వెళ్లేందుకు నాలుగైదు చోట్ల పెద్ద రంధ్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు దృష్టికి సారించకపోవడంతోనే సమస్య అధికమవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల భారీ వర్షాలు పడటంతో కొలిమివీధి, పాత మీసేవా ఏరియా, రామస్వామి వీధులు ముంపునకు గురయ్యాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.20 కోట్లు మంజూరు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్షేత్రస్థాయిలో ముంపు నివారణ సర్వే చేయించారు. అధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదించగా రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్ట్ ఫైల్ టెక్నికల్ మంజూరులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పాలకులు స్పందించి రూ.20 కోట్లను మంజూరు చేయించుకుంటే ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని ప్రజలు అంటున్నారు.

నష్టపోతున్నాం



వర్షం వచ్చినా ప్రతిసారి ఇళ్లలోకి నీరు చేరి తీవ్రంగా నష్టపోతున్నాం. కొలిమివీధి, రామస్వామి వీధి, పాత మీ సేవా ఏరియా సమస్య పరిష్కారం కావడం లేదు. పాలకులు గాని, అధికారులు గాని శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ముంపు సమస్య నుంచి మాలాంటి పేదలను గట్టెక్కించాలి.

– మొహమ్మద్ రఫీక్, కొలిమివీధి

నిధులు మంజూరు చేయాలి



ముంపు పరిష్కారానికి గతంలో రూ.20 కోట్ల నిధులు మంజూరుకాగా టెక్నికల్ శాంక్షన్‌లో ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ముంపు సమస్యను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేస్తే అత్యధికంగా ముంపుకు గురవుతున్న కొలిమివీధి, రామస్వామివీధి, పాత మీసేవా ఏరియా, మధు టాకీస్ ఏరియాల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

– శ్రీనివాసరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్